ఈవారం కథ

# విలువలు

పెనుమాక నాగేశ్వరరావు

"వదినగారూ...పన్లో వున్నారా..." అడుగుతూనే లోపలికి వచ్చింది అనసూయ.

"ఆ...ఏం పన్లే...రండి. మీ అన్నయ్యగారి బట్టలు ఇస్త్రీ చేస్తున్నాను...కూర్చోండి"

...........

"అవునూ బాబుని ఎప్పుడు ఇంటికి పంపిస్తామన్నారు డాక్టర్. కులాసాగానే వున్నాడుగా" అడిగింది కౌసల్య.

'ఆ...మీ అందరి దయవల్ల గండం గడచి బయటపడ్డాడు. ఇంకో రెండు మూడు రోజుల్లో ఇంటికి పంపిస్తావన్నారు డాక్టరుగారు"

"పోన్లేండి. అంతా భగవంతుడి దయ."

"వదినగారూ మీతో ఓ విషయం మాట్లాడాలని వచ్చాను..."

విషయం ఏమిటో వూహించుకోగలిగిన కౌసల్య గుండెలో అలజడి, ఆందోళన.

"ఏమిటో" అంటూ బట్టలు మడతలుపెట్టి బీరువాలో పెట్టి అనసూయకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది కౌసల్య.

"ఏముంటుంది వదినగారూ ఈ గండం నుంచి కూడా మీరే



మమ్మల్ని గట్టెక్కించాలి. అన్నయ్య గారితో కూడా మాట్లాడతానన్నారు మావారు. ఓ వెయ్యి రూపాయలు సర్దుబాటు చేశారంటే డాక్టర్ ఫీజులు, రూం రెంటు వగైరాలు చెల్లించేసి పిల్లవాడ్ని ఇంటికి తెచ్చుకుంటాం, మీదే భారం" అని చెప్పిన హాస్పటల్‌కు బయల్దేరింది అనసూయ.

"ఏమండీ సాయంత్రం వచ్చేటప్పుడు మర్చిపోకుండా డబ్బు పట్టుకు వస్తారుగా" ఆ ఫీసుకు బయలుదేరుతున్న భర్తకు మరోసారి గుర్తుచేసింది కౌసల్య.

"చెప్పేనుగదా...గ్యారంటీ చెప్పలేను. నువ్వు కూడా తొందరపడి ఇచ్చేస్తానంటూ వాగ్దానాలు చేసేయకు. వాళ్ళ ప్రయత్నంలో వాళ్ళుంటారు"

"అలా కాదులెండి పాపం...ఈసారికి ఎలాగోలా వాళ్ళకి ఇద్దామండి. వాళ్ళకిస్తే తిరిగి రాదనే భయం లేదు కదా" అనునయంగా అన్నదామె.

"డబ్బు తిరిగి రాదని కాదు, వాళ్ళకి ఇవ్వకూడదనీ కాదు....ఆవన్నీ నీకు అర్థం కావులే"

"నాకు అర్థం కావక్కర్లేదుగానీ మీరు మాత్రం ఈసారికి డబ్బు ఇచ్చేందుకే చూడండి. పాపం పిల్లవాడు హాస్పిటల్లో వున్నాడు కదా. మొన్నటికి మొన్న పెద్దమ్మాయి పెద్ద మనిషి అయినందుకు ఖర్చుల పడ్డారు. మళ్ళీ ఇంతలోకే పిల్లవాడికి ఆపరేషనంటూ ఆసుపత్రిపాలయ్యారు. పాపం చాలాచోట్ల ప్రయత్నించారట కానీ ఎక్కడా దొరక్క ఇక అడగలేక అడగలేక వచ్చడిగిందామె."

"అడగటానికి అంత ఇబ్బందేముందట. ఇంతకు ముందు వాళ్ళు ఎన్నిసార్లు అడగలేదూ మనం ఎన్నిసార్లు ఇవ్వలేదూ"

"అన్నిసార్లు తీసుకోవడం జరిగింది కాబట్టే మళ్ళీ మనల్ని అడగటానికి ఆమె మొఖమాట పడింది. ఇక గత్యంతరం లేక అడిగింది పాపం. కాదనకుండా ఎలాగో సర్దుబాటు చేద్దామని వుంది నాకయితే."

"చూద్దాంలే" అంటూ ఆఫీసుకు బయల్దేరేడు వినోద్.

* * *

రెండు వాటాల ఇల్లు. రెండు వాటాల్లోనూ అద్దెకు వుంటున్నారు. ఇంటి వాళ్ళు వేరే వూళ్ళో వుంటారు. అత్తలేని కోడలు ఉత్తమురాలు అన్నట్టు పక్కనే ఇంటి వాళ్ళు లేని అద్దె ఇళ్ళు సౌకర్యంగా వుంటాయి.

అలాంటి సౌకర్యాన్ని అనుభవిస్తూ దాదాపు పుష్కర కాలంగా అదే ఇంట్లో వాటాలో వినోద్, కౌసల్య దంపతులు, మరో వాటాలో చక్రపాణి, అనసూయ, పిల్లలు కాపురం వుంటున్నారు.

అంతకాలంగా పక్క పక్కనే వుంటున్న ఆ ఇరు కుటుంబాల మధ్యన కాస్తంత ఆత్మీయత చోటు చేసుకున్నది. కష్ట సుఖాల్లో ఒకరికొకరు తోడుగా అన్నయ్యగారు, వదినగారు అంటూ పెద్దలు, అత్తయ్యగారు, మామయ్యగారు అంటూ పిల్లలు వరసలు కలుపుకుని పిల్చుకుంటుంటారు.

ఆర్థికంగా వినోద్, చక్రపాణి కుటుంబం కంటె పైచేయిగా వుండటంతో అడపాదడపా అవసరాలకు అప్పుగా వారికి డబ్బు ఇవ్వడం, ఇచ్చిన డబ్బును పది రోజులు అటు ఇటుగ వారు తిరిగి ఇచ్చేయడం మామూలైపోయింది ఉభయులకు.

పిల్లలు లేని కారణంగా వినోద్, కౌసల్య పెద్దవాళ్ళయిన చక్రపాణి, అనసూయలపై కనపరచే అభిమానంకంటె వారి పిల్లలు కల్పన, సుధీర్‌ల మీద ఎక్కువ ప్రేమను చూపెడతారు. పిల్లలు కూడా ఆ ఇద్దరి దగ్గరా చనువుగా వుంటుంటారు.

ఆఫీసుకు వెళ్ళే ముందరే బ్యాంకులో వున్న వెయ్యి రూపాయలు డ్రా చేసేశాడు వినోద్.

మనసులోని ఆలోచనలు అతడ్ని ఆఫీసు పని మీద లగ్నం చేయనీయలేదు.

ప్రస్తుతం చక్రపాణి వాళ్ళకు డబ్బు ఎంత అవసరమో వినోద్‌కు తెలియంది కాదు. మనసు ఇవ్వవద్దంటున్నా బుద్ధి ఇవ్వమనే హెచ్చరిస్తోంది.

ఆలోచనల్తోనే అన్యమనస్కంగా ఆనాటి దినపత్రికనందుకున్నాడు వినోద్. తనకు కావలసిన పేజీ తిప్పేడు అంతే. అతని దృష్టి ఓ చోట కేంద్రీకరింపబడింది. ఒకటికి రెండుసార్లు చదివేడు.

ఓ స్థిర నిశ్చయానికి వచ్చి కుర్చీలోంచి లేచాడు. ఓ గంట పర్మిషన్ పెట్టి ఆఫీసు నుంచి బయటకు నడిచాడు. మళ్ళీ బ్యాంకుకు వెళ్ళి ఆ రోజుతోనే గడువు ముగుస్తున్న కారణంగా హడావిడిగా ఫారాలు పూర్తిచేసి వెయ్యి రూపాయలు చెల్లించాడు. ఒక్కొక్కటి పది రూపాయల విలువగల వంద ఈక్విటీ వాటాలకు దరఖాస్తు పంపి ఆఫీసుకు తిరిగి వచ్చాడు వినోద్.

అతనికి ఇప్పుడు చాలా సంతోషంగా వుంది. అంతేకాదు ఎక్కడయినా మరో వెయ్యి రూపాయలు అప్పు దొరికితే భార్య పేరున మరో దరఖాస్తు పంపాలన్న కోరిక కూడా కలిగింది.

మెరుపులా వచ్చిన ఆలోచనతో వెంటనే స్కూటర్ తీసుకుని ఇంటికి బయల్దేరాడు.

మరో బ్యాంక్ డిపాజిట్ రశీదును తీసుకుని బ్యాంకుకు వెళ్ళాడు. డిపాజిట్ రద్దు పరచుకుని ఆ డబ్బుతో కూడా మరో కంపెనీకి సంబంధించిన వాటాలకు దరఖాస్తులు పంపేడు.

అమితానందంగా ఇంటికి చేరేడు. ఎక్కడ తిరిగినా ఎంత మందిని అడిగినా డబ్బు దొరకని చక్రపాణి దంపతులు తమ ఆశలన్నీ వినోద్ మీదనే పెట్టుకున్నారు. చివరికి అతను కూడా ఓ అందమైన అబద్ధం చెప్పటంతో మరోదారి కన్పించక దిగాలుపడిపోయారు వాళ్ళు.

వినోద్‌లో ఇటీవల కన్పిస్తున్న మార్పుని గుర్తించాడు చక్రపాణి. డబ్బు లేదని చెప్పిన కారణం కూడా అతనికి తెలియంది కాదు. ఎన్ని తెలిసినా ఏం ప్రయోజనం.

మానవతా విలువల్ని విస్మరించి కేవలం వాటాల విలువలకే ప్రాధాన్యత నిస్తున్న సమాజంలో తమ లాంటి వారి పరిస్థితి తలుచుకుని మనసులోనే రోదించాడు చక్రపాణి.

సాటి మనిషి చావు బతుకుల్లో వున్నాడన్నా రూపాయి కూడా అప్పు పుట్టని రోజులు వచ్చినందుకు మౌనంగా విలపించడం మినహా మరేం చేయలేని చక్రపాణి దంపతులు శూన్యంలోకి చూస్తూ వుండిపోయారు.


అప్పుచేసి ఇల్లుకట్టండి
ఇల్లు కట్టుకోవాలనే వారికి మాత్రమే!
— వచ్చేవారం చూడండి!